క్లుప్తంగా

తాగునీటి క్లోరినేషన్ నిరంతర ప్రక్రియ



ప్రత్తిపాడు: తాగునీటి క్లోరినేషన్ నిరంతర ప్రక్రియ అని జిల్లా పరిషత్ సీఈవో వి.జ్యోతి బసు అన్నారు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో శనివారం ఆయన పర్యటించారు. రక్షిత మంచినీటి చెరువు వద్ద జరుగుతున్న క్లోరినేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఫీల్డ్ టెస్టింగ్ కిట్ ద్వారా ఇంజనీరింగ్ అసిస్టెంట్‌తో క్లోరినేషన్ పరీక్ష చేయించి వాల్యూలను తెలుసుకున్నారు. అనంతరం స్థానికంగా ఉన్న రెండు ఇసుక ఫిల్టర్‌లు పనిచేయకపోవడం.. వాటికి మరమ్మతులు చేయించకపోవడానికి గల కారణాలేమిటని పంచాయతీ కార్యదర్శి కల్యాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్‌కుమార్‌లను ప్రశ్నించారు. ఫిల్టర్ బెడ్‌ల మరమ్మతులకు సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని వారు తెలుపగా.. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఫిల్టర్‌బెడ్‌లను మరమ్మతులు చేయించాలని ఆయన ఆదేశించారు. వెంట ఎంపీడీవో కె.శివపార్వతి, తదితరులున్నారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

చేబ్రోలు: చేబ్రోలు మండలం వేజండ్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను దాతలు శనివారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన రాచపూడి సునీల్ కుమార్, క్రాంతికుమార్, తోట సాంబశివరావుల సహకారంతో విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. బత్తుల సంతోషి విద్యార్థులందరికీ పెన్నులు, పెన్సిళ్లను అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి రాయల సుబ్బారావు, హెచ్‌ఎం పగడాల శ్రీనివాసరావు, విద్యాకమిటీ చైర్మన్ తోట భువనేశ్వరి, ఉపాధ్యాయులు పరాశరం శ్రీనివాసమూర్తి, లక్ష్మయ్య, సఫియా బేగం తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై దౌర్జన్యం

పట్నంబజారు: ట్రాఫిక్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు ఈస్ట్ సబ్‌డివిజన్ పరిధిలోని ఈస్ట్ ట్రాఫిక్ స్టేషన్ పరిధిలోని సీహెచ్ వెంకటేశ్వరరావు కానిస్టేబుల్ విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఎత్తురోడ్డు సెంటర్ వద్ద తన విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పంచపాల శ్రీకాంత్ అనే వ్యక్తి తన మోటార్ సైకిల్‌పై వచ్చి వేరే వారితో గొడవపడుతున్న సమయంలో సర్దిచెప్పేందుకు వెళ్లిన కానిస్టేబుల్ వెంకటేశ్వరరావుపై దౌర్జన్యానికి పాల్పడ్డాడు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రముఖ నాట్యాచార్యుడు, వేదాంతం సత్యనరసింహశాస్త్రి శిష్య బృందం సాయిశరణ్య శ్రీవైష్ణవి, శ్రీజావైష్ణవిలు వినాయక కౌతంతో ప్రారంభించారు. ఎ.వి. బ్రహ్మాజీ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

క్యాన్సర్‌కు ఆధునిక చికిత్సలు



గుంటూరు మెడికల్: క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, ప్రాథమిక దశలోనే వ్యాధులను త్వరగా గుర్తించవచ్చని ఐవీఎఫ్ స్పెషలిస్ట్, అహల్య ట్రస్ట్ డైరెక్టర్ డాక్టర్ శనక్కాయల రాజకుమారి అన్నారు. స్థానిక సంజీవయ్య నగర్ డాక్టర్ పినపాటి ప్రభుదాస్ మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో క్యాన్సర్, డ్రగ్స్‌పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఎక్కువగా మహిళలే క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారని చెప్పారు. మహిళలు క్యాన్సర్ బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, క్యాన్సర్ వచ్చిన వారిని దాన్ని ఎలా అధిగమించాలి అనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్ వలన జీవితాలు పాడవుతాయని, వాటి వలన కలిగే నష్టాల గురించి వివరించి వాటికి దూరంగా ఉండాలని సూచించారు.

సాగునీరు కోసం రైతన్నలు ఎదురుచూపులు!

వరుణుడు ముఖం చాటేయడంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటలను గడువులోగా సాగు చేస్తామో లేదోనని రైతుల్లో ఆందోళన మొదలైంది. భూమిని సిద్ధం చేసి నెల రోజులు పైనే అవుతున్నా వర్షం లేకపోవడంతో దిక్కు తోచని స్థితిలో కర్షకులు ఉన్నారు. పలు గ్రామాల్లో రైతులు వరి విత్తనం పెట్టే సమయం ఆసన్నం కావడంతో వర్షం పడుతుందని.. పంట కాలువలు వస్తాయనే ఆశతో దుక్కులను శుభ్రం చేసి వరి విత్తనాలు వెదపెట్టారు.



నంబూరు శివారులో వరి విత్తనాలు వెద పెట్టే పనుల్లో రైతులు

- మెట్ట సాగుపై ఆందోళన చెందుతున్న రైతులు
- నీటి విడుదలకు నోచుకోని పంట కాలువలు



నీరు విడుదల కాని హైలెవల్ ఛానల్(పాతకాలువ)

పెదకాకాని : వ్యవసాయ ఆధారిత మండలమైన పెదకాకానిలో వరి, పత్తి, మిరప, మినుము, జొన్న, మొక్కజొన్న ప్రధాన పంటలు ఉన్నాయి. సుమారు 17 వేల ఎకరాల్లో పంటలు సాగు అవుతున్నాయి. నంబూరు, గోళ్లమూడి, తక్కెళ్లపాడు, ఉప్పలపాడు, పెదకాకాని, వెంకటకృష్ణాపురం, తంగెళ్లమూడి, అనుమర్లపూడి గ్రామాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. కొప్పురావూరు, వెనిగండ్ల, పెదకాకాని ప్రాంతాల్లో మెట్ట పంటలు సాగు అవుతున్నాయి. రైతులు వరి పంట సాగును గుంటూరు ఛానల్(కొత్తకాలువ), హై లెవల్ ఛానల్(పాతకాలువ)పై ఆధారపడి పంటలు పండిస్తుంటారు. వరి విత్తనాలు వెదపెట్టుకునే సమయం ఆసన్నం అయినా, పత్తి విత్తనాలు నాటే రోజులు సమీపిస్తున్నా వరుణుడు మాత్రం జాడ లేదు. దీంతో నంబూరు, ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం గ్రామాల్లో వరి సాగుకు ఆలస్యం అవుతుందని భావించి వరి విత్తనాలు వెదపెట్టే పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు.

రైతుల్లో ఆందోళన..

ప్రజా ప్రతినిధులు, అధికారులు పంట కాలువలకు ఒక్క చుక్క నీరు కూడా విడుదల చేయలేదు. దుక్కులు దున్ని నాటిన పత్తి విత్తనాలు మొలక దశలోనే మెలికలు తిరుతున్నాయి. సకాలంలో విత్తనం నాటి పంటలు సాగు చేయడం ద్వారానే అధిక దిగుబడులు వస్తాయని రైతులు పేర్కొంటున్నారు. గతేడాది కూడా ఆశించిన దిగుబడులు రాకపోవడంతో పాటు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో నష్టాలు చవిచూశామని రైతన్నలు చెబుతున్నారు. సకాలంలో వర్షాలు కురుస్తాయోలేదోనని రైతాంగంలో ఆందోళన మొదలైంది.

వర్షం కోసం ఎదురు చూస్తున్నాం..



విత్తనం పెట్టే సమయం రావడంతో ఎండు దుక్కుల్లోనే వరి విత్తనాలు వెద పెట్టాం. జులై మొదటి వారం వచ్చినా ఇప్పటికీ పంట కాలువలకు నీరు వదలడం లేదు. వర్షం కోసం ఎదురు చూస్తున్నాం. ప్రస్తుతం వాతావరణం ఎండ గాలులు వీస్తుండటంతో భూమిలో తేమ శాతం కూడా ఆవిరైపోతుంది.

– భీమవరపు సతీష్‌రెడ్డి, రైతు, నంబూరు

పంట కాలువలకు నీరు విడుదల చేయాలి..



ప్రభుత్వం వెంటనే స్పందించి పంట కాలువలకు నీరు వదలాలి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయ్యింది. పంటల సాగుకు ఆలస్యం అవుతుండటంతో పొలం దుక్కులు దున్ని వరి విత్తనాలు వెదపెట్టాం. కాలువలకు నీరు విడుదల చేసినట్లయితే ఆ నీటితో పొలాలను తడపడం ద్వారా మొలక వస్తుంది.

– శివాబత్తుని దయానంద్‌బాబు, రైతు, ఉప్పలపాడు

విద్యార్థులు ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి

కర్ణాటక ఎన్‌ఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుప్రభా కె.ఆర్



అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందిస్తున్న డాక్టర్ సుప్రభా కె.ఆర్

ప్రత్తిపాడు: విద్యార్థులు ఉద్యోగావకాశాలు ఆశించే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని.. అది నూతన స్టార్టప్‌లను స్థాపించడం ద్వారానే జరుగుతుందని కర్ణాటక ఎన్‌ఐటీ అసోసియేట్ ప్రొఫెసర్, వాద్వాని ఫౌండేషన్ గ్లోబల్ జ్యూరీ మెంబర్ డాక్టర్ సుప్రభా కె.ఆర్ తెలిపారు. గుంటూరు రూరల్ మండలం చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్‌వీఆర్ అండ్ జేసీసీఈ ఎస్‌టీపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఐటీబీఐ సహకారంతో గత మూడు రోజులుగా జరుగుతున్న 'ఐడియా, డిజైన్ అండ్ ఎంట్రిప్రెన్యూర్‌షిప్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం' శనివారంతో ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సుప్రభా కె.ఆర్ మాట్లాడుతూ.. గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో భారత్‌ను అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా ఎంచుకోవాలన్నారు. కళాశాల అధ్యక్షులు డా.రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ కె.జగదీష్‌లు మాట్లాడుతూ.. స్టార్టప్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న స్టార్టప్ ఇండియా, అటల్ ఇన్నోవేషన్ మిషన్, పీఎంఈజీపీ వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్–డీ డైరెక్టర్ డా.కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా.ఎస్.వి. శ్రీనివాసరావు, ఐటీబీఐ ప్రధాన పరిశోధకులు డా.ఎం.వి.పి. చంద్రశేఖరరావు, ఇంక్యుబేషన్ మేనేజర్ డా.కె.శోభ, ఆర్‌జేఈ నెస్ట్ సీఈవో డా.ఆర్.హఫీజ్‌బాషా, కో–ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డా.సజ్జా రాధికా, వివిధ కళాశాలల నుంచి హాజరైన అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేయాలి



పొగాకు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాయకులు

పెదకాకాని: పొగాకు రైతులు కొనుగోలు కేంద్రానికి తెచ్చిన నల్లబర్లీ పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేయాలని.. నాశిరకంగా ఉందనే పేరుతో తెచ్చిన పొగాకును వెనక్కి పంపడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు తెలిపారు. పెదకాకానిలోని పొగాకు కొనుగోలు కేంద్రాన్ని శనివారం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ, కౌలురైతు సంఘం నాయకులు నీలాంబరం, రాజారమేష్ తదితరులతో కలిసి ఆయన పరిశీలించారు. ఆయన రైతులు, అధికారులతో మాట్లాడుతూ.. జిల్లాలో 7 కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి కేవలం గుంటూరు, పెదకాకానిలో మాత్రమే కొనుగోలు కేంద్రాలను పెట్టారని, ఇది సరికాదని చెప్పారు. పెదనందిపాడు, ప్రత్తిపాడు, కాకుమాను మండల కేంద్రాల్లో పొగాకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాని కోరారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన వాగ్దానానికి అనుగుణంగా మొత్తం పొగాకు కొనుగోలు చేయాలని.. లేకపోతే ఆందోళన చేపడతామని నాయకులు పేర్కొన్నారు.

విత్తన దుకాణాలపై అధికారులు దాడులు

రూ.4.72 కోట్ల విలువలైన మిర్చి విత్తనాల అమ్మకాలు నిలుపుదల




విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ప్రత్తిపాడు: వ్యవసాయశాఖ అధికారులు విత్తన దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 40 మంది వ్యవసాయశాఖ అధికారులు 13 టాస్క్‌ఫోర్స్ బృందాలుగా ఏర్పడి శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గుంటూరు టౌన్‌తో పాటు గుంటూరు రూరల్ మండలాల్లోని అన్ని రకాల విత్తన దుకాణాలు(మాన్యుఫాక్చరింగ్ కంపెనీలు, ప్రాసెసింగ్ యూనిట్లు, రిటైల్, హోల్‌సేల్)పై ఏకకాలంలో తనిఖీలు చేశారు. రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, నిల్వలను పరిశీలించారు. ఆయా విత్తన దుకాణాల్లో విత్తన చట్టం 1966, విత్తన కంట్రోల్ ఆర్డర్ 1983కి విరుద్ధంగా విక్రయాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు చట్టానికి విరుద్ధంగా అమ్మకాలు నిర్వహిస్తున్న రూ.4.72 కోట్ల విలువలైన 704.84 కేజీల మిర్చి విత్తనాలు, రూ.5.64 లక్షల విలువైన 293.85 కేజీల ఇతర విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు డీఏవో తెలిపారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ.. విత్తన దుకాణాదారులందరూ విత్తన చట్టానికి లోబడి అమ్మకాలు చేపట్టాలన్నారు. లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్యకు నోటీసులు

- స్థలం ఆక్రమణ ఫిర్యాదుపై స్పందించిన కార్పొరేషన్ కమిషనర్
- డాక్యుమెంట్స్‌ను కమిషనర్ వద్ద పొందుపరచాలని నోటీసు



మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య, గుమ్మడి భారతికి కమిషనర్ ఇచ్చిన నోటీసులు

నెహ్రూనగర్: మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య జీటీ రోడ్డులో(మిర్చి యార్డు) ఉన్న నా స్థలాన్ని కబ్జా చేసి అక్రమంగా నిర్మాణం చేపడుతున్నారని శారదా కాలనీకి చెందిన గుమ్మడి భారతి ఏప్రిల్ 2వ తేదిన పీజీఆర్ఎస్‌లో నగర కమిషనర్, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు ఆధారంగా నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆస్తి హక్కుకు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను తీసుకుని ఈ నెల 8వ తేదీ ఉదయం 11 గంటలకు కమిషనర్ చాంబర్‌లో కమిషనర్‌కు చూపించాలని కిలారి రోశయ్యకు, అదే విధంగా గుమ్మడి భారతిలకు శనివారం నోటీసులు జారీ చేశారు.

వివాదం ఏమంటే...

గుంటూరు జీటీ రోడ్డు(మిర్చియార్డు)లోని 1.23 సెంట్లు స్థలాన్ని 1980లో ఓ వ్యక్తి నుంచి వద్ద నుంచి గుమ్మడి భారతి భర్త రాజారావుతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు కలసి స్వాధీన అగ్రిమెంట్ కింద(ముగ్గురు మూడు భాగాలుగా తీసుకున్నారు) కొనుగోలు చేశారు. అయితే సదరు స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయకుండా స్థలం అమ్మిన వ్యక్తి 1981లో తన అనుచరులతో కలిసి కావాలనే కోర్టులో వ్యాజ్యం వేయించి సదరు స్థలాన్ని అప్పు కింద అటాచ్ చేసి ఇవ్వాలని కోర్టును ఆశ్రయించాడు. 1999 వరకు కోర్టులో వాదనలు జరుగుతూ వస్తున్న క్రమంలోనే 1989, 91, 94వ సంవత్సరాల్లో స్థలం అమ్మిన వ్యక్తే మాజీ ఎమ్మెల్యే తాలుకా వ్యక్తులకు జీపీఏ(జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ) చేశాడు. గుమ్మడి రాజారావుతో కలసి ఉన్న ఇద్దరు వ్యక్తులు కూడా ఎమ్మెల్యేకు సపోర్ట్‌గా స్థలం అప్పగించేందుకు కంకణం కట్టుకోవడంతో 1.23 సెంట్ల స్థలంలో 2015లో ముందు భాగంలో ఒక థియేటర్, వెనుక భాగంలో అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టారు. మధ్యలో ఉన్న రాజారావు స్థలాన్ని అలాగే ఖాళీగా వదిలేశారు. సదరు స్థలాన్ని రాసివ్వాలని పలు మార్లు బెదిరించినా రాజారావు స్పందించకపోవడంతో కారుతో గుద్దించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. గత సంవత్సరం అనారోగ్యం కారణంగా రాజారావు మరణించడంతో ఇంకా ఎవరు అడ్డు లేరులో అని సదరు స్థలంలో నిర్మాణం ప్రారంభించారని ఆరోపించారు. దీనిపై నగర కమిషనర్‌కు, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశానని గుమ్మడి భారతి చెప్పారు. సదరు ఫిర్యాదు ఆధారంగా శనివారం నోటీసులు జారీ చేశారు. నగరపాలక సంస్థ అధికారులు. ఇద్దరు డాక్యుమెంట్స్ పరిశీలించిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 131 కేసులు పరిష్కారం



పొన్నూరు: పట్టణంలోని అడిషనల్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 131 కేసులు పరిష్కరించినట్లు న్యాయమూర్తి జి.రుక్మిణి తెలిపారు. సివిల్–18, మనోవర్తి 1, క్రిమినల్–78, ఎక్సైజ్–27, చెక్ బౌన్స్ కేసులు పరిష్కారం అయ్యాయని పేర్కొన్నారు. ఈ కేసులలో కక్షిదారులకు రూ.38.88 లక్షల పరిహారం కింద అందజేశారని తెలిపారు. అదాలత్ సభ్యులుగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్.బాజీసాహెబ్ వ్యవహరించారు. న్యాయవాదులు పి.జయరాజ్, మక్బుల్ బేగ్, ఎమ్.ఈరేష్, టి.రమేష్, ఎన్.కృష్ణ, సదానందరావు, డి.కోటేశ్వరరావు, న్యాయవాద గుమస్తాలు, పోలీసు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సీబీఎస్ఈ పాఠశాలల ప్రిన్సిపాళ్లకు శిక్షణ తరగతులు



గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల వేదికగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని సీబీఎస్ఈ పాఠశాలలకు చెందిన ప్రిన్సిపాల్స్‌కు జాతీయ నూతన విద్యా విధానం–2020పై రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్రటేరియట్ ట్రైనింగ్ అండ్ మేనేజ్ మెంట్ (ఐఎస్‌టీఎం), కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీఓపీటీ) సభ్యులతో కలిసి సీబీఎస్ఈ బోర్డు ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ (టీఓటీ) సర్టిఫికేషన్ కోర్సు నిర్వహించారు. జాతీయ నూతన విద్యావిధానం ఫ్రేంవర్క్ ఆధారంగా ఉపాధ్యాయులకు సీబీఎస్ఈ రిసోర్స్ పర్సన్లుగా పని చేసేందుకు టీఓటీ కోర్సు ఉపయోగపడుతుందని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. వర్క్‌షాప్ నిర్వహణ ప్రతినిధులుగా ప్రమోద్ కుమార్ జైస్వాల్, డాక్టర్ సజీవ్, డాక్టర్ సునీర్ నాగి దీప వ్యవహరించారు.

మోదీ పాలనలో వికసిత భారత్



కరపత్రాలను ప్రదర్శిస్తున్న తిరుపతిరావు, పార్టీ నాయకులు

ప్రత్తిపాడు: దేశ ప్రధాని నరేంద్ర మోదీ భారతదేశాన్ని వికసిత్ భారత్ దిశగా నడిపిస్తున్నారని భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అన్నారు. ప్రత్తిపాడులో శనివారం బీజేపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు కఠారి దత్తప్రసాద్ సాగర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా తిరుపతిరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 15 ఎకరాల విస్తీర్ణంలో రూ.94 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో నడింపాలెంలో 100 పడకల ఆయుష్ హాస్పటల్‌ను నిర్మించనుందని అన్నారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు మండల ఉపాధ్యక్షుడు మట్టా వెంకటేశ్వర్లు, మండల నాయకులు పాపన్న వెంకటశివ, తణుకు వసంతకుమారి, గుంటుపల్లి తులసీరామ్, బాపతు రమణారెడ్డి, కాజా సాంబిరెడ్డి బీజేపీ సీనియర్ నాయకులు కొత్తూరి వెంకటసుబ్బారావు, నియోజకవర్గ ఇన్‌చార్జి వైవీ సుబ్బారావు, నియోజకవర్గ కోకన్వీనర్ దర్శనపు శ్రీనివాసరావు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు దారా అంబేద్కర్, బజరంగ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు.. పట్టర పట్టు!



ఆర్టీసీ అధికారులు కాలం చెల్లిన బస్సులు నడుపుతున్నారో ఏమో! అందులో ప్రయాణించే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏ బస్సు ఎప్పుడు, ఎక్కడ మొరాయిస్తుందో తెలియని పరిస్థితి ఎదురవుతుండడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. ప్రత్తిపాడు అంకమ్మ గుడి సెంటరులో గుంటూరు పర్చూరు పాత మద్రాసు రోడ్డుపై శుక్రవారం మధ్యాహ్నం పెదనందిపాడు వెళుతున్న ఎక్స్‌ప్రెస్ సర్వీసు ముందుకు కదలకుండా మొండికేసింది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా ఫలితం లేదు. గత్యంతరం లేక బస్సులోని ప్రయాణికులు కిందకు దిగి ఓ పట్టు పట్టారు. ఈ క్రమంలో ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. – ప్రత్తిపాడు

చంద్రమౌళినగర్ పోస్టాఫీసు ఎదుట పోస్ట్‌మెన్‌ల ధర్నా



చంద్రమౌళినగర్ పోస్టల్ సూపరిటెండెంట్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న పోస్ట్‌మెన్‌లు

లక్ష్మీపురం: ఆదివారం కూడా పోస్ట్‌మెన్‌లను ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాల్సిందిగా డివిజన్ పోస్టల్ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో పోస్ట్‌మెన్‌లు శనివారం రాత్రి ధర్నాకు దిగారు. గుంటూరు చంద్రమౌళినగర్ పోస్టల్ సూపరిటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆదివారాలు కూడా పనిచేసే విధంగా ఐడీసీ(ఇంటిగ్రేటెడ్ డెలవరి సెంటర్‌ను) కొత్తపేటలో ఏర్పాటు చేశారు. కొత్తపేట పోస్టాఫీసు ఐడీసీ పరిధిలో కొత్తపేట, గుంటూరు కలెక్టరేట్ పోస్టాఫీసు, గుంటూరు బజార్ పోస్టాఫీసులలో విధులు నిర్వహించి సుమారు 60 మంది పోస్ట్‌మెన్‌లు, ఉమెన్‌లు ఉన్నారు. అయితే ఐడీసీ నిబంధనల ప్రకారం ఆదివారం కూడా విధులు నిర్వహించాలన్న విషయాన్ని పోస్టల్ ఉన్నతాధికారులు ముందుగా పోస్ట్‌మెన్‌లకు సమాచారం ఇవ్వలేదు. ఆదివారం మొహర్రం, తొలి ఏకాదశి కావడంతో ఆదివారం కూడా విధులు నిర్వహించాల్సిందిగా శనివారం సాయంత్రం పోస్ట్‌మెన్‌లకు చెప్పడంతో ఒక్కసారిగా పోస్ట్‌మెన్‌లు చంద్రమౌళి నగర్ వద్ద ధర్నాకు దిగారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఏఎన్‌యూ వీసీ గంగాధరరావు



శిక్షణ పొందిన మహిళలతో ఏఎన్‌యూ వీసీ

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు పేర్కొన్నారు. ఏఎన్‌యూ కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగం ఆధ్వర్యంలో అరండల్‌పేటలోని వావిలాల గోపాలకృష్ణయ్య సంస్థలో సేవాభారతి విభాగం ద్వారా కుట్టుమిషన్ శిక్షణ పొందుతున్న మహిళలకు కుట్టుమిషన్ మరమ్మతులపై శనివారం ఒక్కరోజు ఉచిత శిక్షణ కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్షతకు తావు లేదని చెప్పారు. సేవా భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కేవీఎస్ఎన్ చారి మాట్లాడారు. అనంతరం శిక్షణ పొందిన 40 మంది మహిళలకు వీసీ చేతుల మీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ బి.బబిత, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఎంపీ రమణ, సేవా భారతి జిల్లా కార్యదర్శి జాగు శ్రీనివాస్, శిక్షకుడు షేక్ కరీముల్లా, ఎస్.శ్యామల పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం



గుంటూరు మెడికల్: సామాన్య, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలనే ముఖ్య ఉద్దేశంతో ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు హాస్పిటల్ చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. శనివారం స్థానిక నాజ్‌సెంటర్‌లోని హాస్పిటల్‌లో మీడియా సమావేశం నిర్వహించి, వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గోరంట్ల రామాలయం గుడివద్ద ఉన్న పి.హెచ్.సి సెంటర్‌లో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తేజస్విని, డాక్టర్ అన్వేష్ కుమార్, డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.